# నాకు నచ్చిన నా కథ

ఎన్నో రకాల కథలు వ్రాస్తారు రచయితలు. ప్రేమ కథలు, పెళ్ళి కథలు, చాచా కథలు, సోషో కథలు, ఆకలి కథలు, చేతబడి కథలు, సారా కథలు, సారో కథలు రాసినప్పుడు ప్రతి కథా బాగానే వున్నట్లనిపిస్తుంది. అదో అథాన. ఆర్నెల్లు తిరగకుండానే ఆ రచన మాసిన చీరలా వెలవెలబోతుంది. ఈ కథను 1974లో వ్రాసాను. అప్పటికీ, ఇప్పటికీ ఈ కథలో వున్న పరిస్థితి మన దేశంలో మారలేదు. మధ్యతరగతి వాడి బ్రతుకు నవ్వుల నందనం కావడంలేదు.



కొండముది శ్రీరామచంద్రమూర్తి

చిన్నచిన్న కోరికలు, వో స్కూటరు కొనుక్కుందామనీ, వో గూడు వేసుకుందామనీ, డన్‌లప్ బెడ్‌మీద అర్ధాంగితో కలిసి మధుకోహల్లో తేలిపోవాలనే అతను కనే కలలు నిజం కావడంలేదు. చివరకు కలలు కనడానికి కూడా వీలు లేనంతటి ఎడారితనం బ్రతుకును క్రమ్ముకుంటోంది. ఈ నిష్ఠురసత్యాన్ని వీలయినంత కాంతాసమ్మితంగా చెప్పే ప్రయత్నం చేశాను. ఈ కథలో, మధ్యతరగతి మనుగడ వున్నంతవరకూ ఈ కథకు జీవం వుంటుంది. అందుకనే ఈ కథంటే ఇష్టం నాకు. కథవస్తువుకూ, కథనానికీ సయోధ్య బాగా కుదిరితే ఆ రచనకో ఎఫెక్ట్ వస్తుంది. సాదాసీదాలా చెప్పుకుపోతూ కథను ఒడ్డుకుచేర్చడం ఇందులో టెక్నిక్. పాత్రలెక్కడివాళ్లో కాదు, రోజూ చూసే సుబ్బారావూ,

రామారావూ, రంగారావూ, వెంకటరావూ మరోపేరు పెట్టుకుని ఇందులోకి వచ్చారు. సంఘటనంతా ఎక్కడిదో కాదు, మీ ఇంట్లో, పక్కింట్లో, తెలిసినవాళ్ళ ఇళ్ళల్లో నిన్న జరిగినవి, లేకపోతే ఇప్పుడు జరుగుతున్నవి. ఇది రియల్ లైఫ్. జీవితంలో ఒక ముక్క తీసి ఇందులో చెప్పగలిగాననే ఈ కథంటే ఇష్టం నాకు.

# మధ్యతరగతి మధురస్వప్నం

తలలో మల్లెలు తురుముకుని, జపాన్ నైలెక్స్ చీర కట్టుకుని చేతులకు రెండు జతల బంగారు గాజులు వేసుకుని మెళ్ళో మూడుపేటల చంద్రహారంతో క్రొత్తగా చేయించుకున్న నల్లపూసల గొలుసు జతకలిపి మురిపిస్తుండగా, నొసటిమీద అల్లల్లాడుతున్న ముంగురులను, తీర్చిదిద్దుకున్న తిలకం చెరిగి పోకుండా అలవోకగా సర్దుకుంటూ, గేటు దగ్గర నిలబడి అస్తమిస్తున్న సూర్య కాంతిలో ఎర్రగా మెరిసిపోతూ, ఎంతకూ ఇంటికిరాని భర్తకోసం కొంచెం కోపంతోనూ మరికొంచెం విసుగుతోనూ ఎదురుచూస్తూ నుంచున్నది కరుణ.

ఆకాశంలో రకరకాల పక్షులు ఎగురుతున్నాయ్. పలుచోట్ల నుండి రక రకాల ధ్వనులు వినపడుతున్నాయ్. ఎదురుగా వేపచెట్టుకొమ్మలు రెమ్మలు సాచి గంభీరంగా కన్పిస్తున్నది. వేపచెట్టు కింద పసితనం వదలని పిల్లలు కొందరు రకరకాల ఆటలతో తమ లోకంలో తాము వున్నారు.

సాయంకాలం పూట పాలుపోసే పాలమనిషి వచ్చి ఎదురింట్లో పాలు పోసి సైకిలెక్కి బెల్లు వాయించుకుంటూ వెళ్ళిపోతున్నాడు. అరుదాటిన సూచన-

ఇంకా మన్మధ ఇంటికి రాలేదు.

లోపలనుంచి ప్రాంతీయ వార్తలు వినబడటం ప్రారంభమైంది.

దూరంగా ఎవరో సైకిలుమీద వస్తున్నారు. బహుశ మన్మదే కావచ్చు. కరుణ ఆశగా విప్పారగిన కళ్ళతో ఆ వస్తున్న వ్యక్తి వేపు చూసింది. ఊహుఁ కాదు అతను మన్మధ కాదు. అదే సందులో ఏడో ఇంట్లో వుంటున్న కలెక్టరాఫీసు గుమాస్తా.

మన్మధ అతనూ దూరానికి ఒకలాగే కన్పిస్తారు- ఖర్మ!! ఆ వీధిలో ఆ ఇద్దరికీ సైకిళ్ళు వున్నాయి. మిగిలిన వాళ్ళలో చాలా మందికి స్కూటర్లు, ఒకళ్ళిద్దరికి కార్లు!!

కరుణ నిరాశపడి తల త్రిప్పుకున్నంతలో- ఎదురింటి వరండాలో నుండి స్కూటరు కిందకు దింపుతూ సుధాకరం కనిపించాడు. అతనికి ప్రక్కన విచ్చు కున్న మందారంతో, సుధ నిల్చొని వున్నది.

సుధాకరం ఏదో జోక్ వేసి వుంటాడు. సుధ పెద్దగా నవ్వుతోంది: 'ఆ జోక్ ఒంటరిగా నిలబడ్డ తనగురించి అయి ఉండదుకదా,'

అనాలోచితంగానే కరుణ బుజంమీందుగా పమిట కప్పుకుంది.

స్కూటర్ స్టార్ట్‌చేయడానికి సుధాకరం కొంచెం శ్రమపడుతున్నాడు. అది మొరాయిస్తుంది.

"కార్బన్ పట్టినట్టుంది!" అన్నాడు నొసటన పట్టిన చెమటను తుడుచు కొంటూ

"కొంపతీసి ఇప్పుడు గాని క్లీనింగ్ మొదలుపెట్టరు కదా!" అన్నది సుధ గోముగా.

"ఐ కాన్ట్ సే!"

సుధాకరం చోక్ వేశాడు. యాక్సిలరేటర్ రెయిజ్ చేశాడు. ఒకటి రెండు, కిక్‌లు బలంగా ఇచ్చాడు. నిద్రమత్తు వదిలినట్టుగా ఆ స్కూటరు చలన సంగీతం ఆరంభించింది.

గర్వంగా భార్య వేపుచూస్తూ "ప్రొద్దుట్నుంచీ స్టార్ట్‌చెయ్యలేదు కదూ- అందుకని ట్రబుల్! మన స్కూటరు మనల్నెప్పుడూ లెట్ డౌన్ చెయ్యదు" అంటూ ఎక్కి కూర్చుని క్లచ్ మారుస్తూ "ఊఁ! కూర్చో!- అవతల టైమయి పోతోంది" అన్నాడు పిలియన్ సీట్ ఆఫర్‌చేస్తూ.

సుధ సుతారంగా చీరచెరగులను ఎత్తిపట్టుకొని, వయ్యారంగా ఒక వేపుకు ఒదిగికూచుని భర్త భుజంమీద ఒక చేయివేసి రెండోచెయ్యి స్టెపిన్‌మీద వేసి, "ఊఁ! పోనీండి" అన్నది

స్కూటరు మీద వెళుతూ వంటరిగా గేటుదగ్గర నిలబడ్డ కరుణను సుధ చూసి నవ్వుతూ విష్ చేసింది. ఏదో అనెను కూడా అన్నది. స్కూటరు శబ్దంలో ఆ మాట ఏమిటో కరుణకు స్పష్టంగా వినబడలేదు. స్కూటరు ముందుకి వెళుతుంటే సుధ కట్టుకున్న జరీపూల ఎర్రచీర చెంగు జయ తాకలా ఎగురుతూ కనిపిస్తోంది. సుధ తలలో పెట్టుకున్న ఒకే ఒక ఎర్రగులాబీ ఇంత దూరానికి గూడా నల్లని ఆకాశంలో వంటరి జ్వాలానక్షత్రంలా మెరుస్తూ కన్పిస్తోంది.

సుధ రాసుకున్న అత్తరు పరిమళం విసురుగా వచ్చిన గాలికెరటంలోకి కలిసి గుండె లోతులను స్పర్శిస్తోంది.

కరుణకు ఇతమిద్ధమవి తెలీని కారణంతో మనస్సు చివుక్కుమంది. సుధాకరం తన భర్తా ఇద్దరూ కాలేజీలో లెక్చరర్లే! ఇద్దరూ ఒకేసారి చేరారు సర్వీసులో! తాను సుధా ఒకేసారి కాపురాలకు వచ్చారు.

అయితే ఏం తన జీవితం ఉన్నచోటే వుంది.

సుధాకరం తానంతవరకు అద్దెనుంటున్న ఆ ఎదుటింటిని స్వంతం చేసుకున్నాడు. ఇల్లు కొనీ కొనకుండానే స్కూటర్ కొన్నాడు. స్కూటర్ వచ్చీ రాకుండానే భార్యతో కలిసి సరదాగా అక్కడికీ ఇక్కడికీ వెళ్ళివస్తున్నాడు!!

ఆ క్షణంలో కరుణకు-

సుధాకరం ఉదయం నాల్గుగంటలకల్లా లేచి బ్యాచి తరువాత బ్యాచికి ట్యూషన్లు చెప్పడం జ్ఞాపకం రాలేదు.

అతనికి భార్యతరపున కలిసిన సుక్షేత్రమైన తణుకు పంటపొలం జ్ఞాపకం రాలేదు.

అటు పెళ్ళిచేయవలసిన చెల్లెళ్ళు కానీ ఇటు పోషించవలసిన వృద్ధ తల్లి తండ్రులు కానీ అతనికి లేనివిషయం ఆమెకు అసలు జ్ఞాపకమే రాలేదు.

సుధాకరం ఎంతో సమర్థుడుగా ప్రయోజకుడుగా కనిపించాడు! మన్మథ జీవితంలో అన్నీ పోగొట్టుకుంటూ ఏమీ సాధించాలేకున్న అమాయకుడుగా కనిపించాడు.

ఓ సంవత్సరం క్రితం—

సుధాకరం దంపతులు సమధికోత్సాహంతో గృహప్రవేశం జరుపుతున్న రోజున తనకూ మన్మథకూ జరిగిన సంభాషణ అనుకోకుండా ఆ సమయంలో ఆమెకు జ్ఞాపకం వచ్చింది.

"మనమూ ఇల్లు కొనుక్కుందామండీ!"

"కరుణా!" మన్మథ కంఠస్వరం బరువుగా ధ్వనించింది. "ఇంటి సంగతి దేవుడెరుగు. ముందు అనూరాధ పెళ్ళి చెయ్యాలి! ఎట్లాగా అని నాన్నకు, నాకూ కూడా ఒకటే ఇదిగా వుంది!"

కరుణ కాసేపు మౌనంగా ఊరుకుంది.

"పోనీ- మీరు కూడా ట్యూషన్లు చెప్పకూడదు ఉంటే!" అన్నది

"చెప్పను."

మన్మధ గొంతులో విచిత్రమైన నిశ్చయం.

ఇంటిదగ్గర ట్యూషన్లు చెప్పడం కోసమని కాలేజీ పాఠలు చెప్పకుండా విద్యార్థులను మోసగించడం ధర్మద్రోహం. యూనివర్సిటీ చెప్పకూడదన్నది. కాలేజీ గవర్నింగ్ బాడీ వద్దంది. డిసిప్లిన్‌కు వ్యతిరేకంగా నడవడం నావల్ల కాదు.

"ఎదురింటి సుధాకరంగారు చెప్పడం లేదేమిటి?"

"సాగినంత కాలం సాగుతుందని అతని మనస్తత్వం. ఇటు ట్యూషన్లూ చెప్పగలడు. అవసరమొస్తే అటు సెక్రటరీగార్ని ఆశ్రయించనూ గలడు. ఆ పన్లేవీ నేను చెయ్యలేను కరుణా! ఐయామ్ సారీ! అన్యాయార్జిత విత్తంతో మేడల్లో నివసించడం కన్నా న్యాయంగా సంపాయించిన దాంతో గుడిసెల్లో వుండడం మేలని నా అభిప్రాయం." కరుణ భర్తతో వివాదానికి దిగలేదు. ఆదర్శాలను నమ్ముకున్న మనిషితో వివాదపడి మాత్రం లాభమేమిటి? అయితే ఆదర్శాల కోసమని జీవితంలో చిన్న చిన్న సుఖాలను కూడా వదులుకోవాలా అన్నదే ఆమెకు అర్థంకాని విషయం.

తనదీ అన్న ఓ స్వంత గూడు వుండడం-

వాళ్ళమీద వీళ్ళమీద ఆధారపడకుండా ఓ స్వంత వాహనముండడం-

డన్‌లప్ పరుపు పైన స్ప్రింగ్ కాట్ మీద పడుకుని వెచ్చగా భర్తపరిష్వంగంలో కరిగిపోవడం-

మండువేసవిలో ఎండనపడి వచ్చిన ప్రాణానికి ఇంత చల్లని మంచి తీర్థమివ్వడానికి వో మినీ ఫ్రిజ్-

వో సీలింగ్ ఫాన్. వో సోఫాకమ్‌బెడ్, వో గాద్రెజ్ బీరువా, ఇవన్నీ ఈ ఇరవయ్యో శతాబ్దపు ఉత్తరార్థంలో ఎవరైనా కోరుకోదగిన కనీస సౌకర్యాలు కావా?

మన్మధ దృష్టిలో కావు.

తన దృష్టిలో అవును.

ఈ ఉత్తర దక్షిణ ధృవాల మధ్య సయోధ్యకు తావులేదు. ఎవరో ఒకరు పూర్తిగా తన స్వభావాన్ని మార్చుకోవాలి. తనే మార్చుకుంది. కానీ అపుడపుడు తనలో తనకే బాధ కలుగుతుంటుంది.

ఇప్పుడు తన భర్త తన చెల్లెలి కోసమని తన జీవితంలోని ఆనందాన్ని త్యాగం చేస్తున్నాడు. రేపు ఆ చెల్లెలు పెళ్లైపోయింతర్వాత వృద్ధులైన తల్లితండ్రుల కోసమని మళ్ళీ తన సుఖాన్ని త్యాగం చేస్తాడు. ఆ తర్వాత తమకు

వుట్టే పిల్లలకోసమని తన ఆనందాన్ని త్యాగం చేస్తాడు. ఇట్లా త్యాగంతో సేవా భావంతో ఆ జీవితంలో ప్రథమార్ధమంతా గడచిపోతే ఉత్తరార్ధంలో ఇంకా అతను సుఖపడేదేమిటి?...

తనను సుఖపెట్టేదేమిటి?...

ఈ రకమైన ఆలోచనల సాలెగూటి లోంచి ఆమె బయటపడక ముందే మన్మథ మెల్లగా సైకిలుమీదవచ్చి ఉస్సురంటూ ఆమె ముందు దిగాడు. దిగుతూనే, "వెధవ సైకిలు, వెధవ సైకిలని! పైరు పంక్చరైంది. దారిలో పంక్చరదీ వేయించుకుని, ఎంత తొందరగా వద్దామన్నా"..... అంటూ ఆగిపోయాడు క్షమాపణ చెప్పుకుంటున్నట్లు.

అతను మాట పూర్తిచెయ్యలేదు. కరుణ అతన్నిపైపు జాలిగా చూసింది. అతని జుట్టంతా చెదిరిపోయింది. మొహంనిండా చెమట పట్టింది. సైకిలు తొక్కడంతో ప్యాంటు మడతలు నలిగిపోయాయి. ఆయాసంతో మనిషిలో కొంత వగర్పు. స్కూటరు మీద సుధాకరం ఒక్క క్షణం ఆమె కళ్ళల్లో మెదిలాడు. స్కూటరు మీద అతను రాజకుమారుడిలా వెలిగిపోతున్నాడు. సైకిలు మీద తన భర్త బికారిలా ఉస్సురంటున్నాడు.

"బాగా ఆలస్యమైపోయింది కదూ?- టిక్కెట్లు దొరకవేమో!"

"పోనీలెండి- రేపు వెళ్దాం!"

సైకిలు లోపల పెడుతున్న మన్మథ తల అడ్డంగా తిప్పాడు.

"వద్దు వద్దు ఇవాళే వెళ్దాం. టికెట్లు దొరకేక్కేం?- ఈ సినిమా వచ్చి అప్పుడే మూడోవారం కూడానూ!"

తనను నిరాశపరచకూడదని అట్లా అంటున్న భర్తను చూసిన కరుణ హృదయం అతనిమీద అభిమానంతో ఆర్ద్రమైంది. అతన్ని ఆ సమయంలో వారించడం ఇష్టంలేక, "సరే అయితే! తొందరగా టాయిలెట్ కండి!" అన్నదీఉత్సాహంతో.

"ఎంత?- వన్ మినిట్!"

అన్నట్టుగానే మన్మథ ఒక్క నిముషంలో తయారై వచ్చినా వాళ్ళు రిక్షా మాట్లాడుకుని థియేటరు చేరుకునేసరికి ఓ అరగంట పట్టింది. ఎక్కడో ఊరవతల వుంది ఆ సినిమా హాలు అప్పటికే బుక్కింగ్‌ల దగ్గర క్యూ పల్చబడింది. హాలు బయట తినుబండారాల వాళ్ళ ధ్వనులు తగ్గుస్థాయిలో వున్నాయి.

మన్మధ రిక్షా దిగి కౌంటరు వైపు అడుగు వేసేంతలోనే, కౌంటరు మూసేసి "హాలు నిండినది" అన్న బోర్డు తగిలించారు బయటగేటుకు.

కరుణ రిక్షా దిగనేలేదు. ఆమె మనసు భారమైంది. ఏదో చెప్పలేని వెలితి.

"మనం ఇంకొంచెం ముందు రావలసింది కరుణా!"

కరుణ మ్లానంగా నవ్వింది. "సరేలెండి! రండి. ఇంకా ఎందుకూ ఇక్కడ? ఈ రిక్షాలోనే ఇంటికి పోదాం!"

మన్మధ తప్పుచేసినవాడిలా రిక్షా ఎక్కాడు. రిక్షా వెనక్కు తిరిగింది. ఒకటి రెండు గజాలు అది సాగకుండానే సినిమా థియేటరు సమీపంలోనే వాళ్ళకు సుధాకరం స్కూటరుమీద ఎదురైనాడు.

మన్మధను చూస్తూనే స్కూటరును స్లో చేస్తూ, "హల్లో! ఏం వచ్చేస్తున్నారూ? టికెట్టు దొరకలేదా?" అని అడిగాడు.

అవమానానికి తోడు గాయన్నికూడా జతచేయడం అంటే ఇదేకామోసు!

"హౌస్‌ఫుల్!"

"మాకు తెలుసు. అందుకనే ముందు ఇక్కడికి వచ్చి టిక్కెట్లు తీసుకుని ఆ తరువాత మధులతకు వెళ్ళి ఇట్లా వస్తున్నాం. అయినా మీరొస్తున్నట్లు ముందుగా మాకు ఇన్‌ఫాం చేసినట్లయితే మీకూ కూడా టిక్కెట్లు తీసుకునేవాణ్ణిగా! వెనగ్గా మీరు రిక్షాలో వచ్చినా ఇబ్బంది లేకపోయేది!".

'రిక్షాలో వచ్చినా' అంటే ఆ మాటలో గల అంతరార్థ మేమిటో!" అడగాలనిపించినా అడగలేక వూరుకుంది కరుణ.

అయినా తనకు తెలుసు వాళ్ళు స్కూటరువాళ్ళు? ఎక్కడైనా తిరగ్గలరు. అన్నిపనులూ క్షణంలో పూర్తిచేసుకోగలరు.

తామంటే సైకిలువాళ్ళు. రిక్షాలో తిరుగుతూ ఒకరిమీద ఆధారపడేవాళ్ళు "దట్సాల్ రైట్!" అన్నాడు మన్మధ, తన కో లెక్చరర్ మాటలను తేలిగ్గా తీసుకుంటూ.

ఇంటికి వచ్చిన తరువాత కూడా కరుణ ఇంకా ఆ మాటలనే పునశ్చరణ చేసుకోసాగింది.

తాము సైకిలువాళ్ళు! ఎల్లకాలం తాము సైకిలువాళ్ళేనా? సైకిలు క్లాసునుండి స్కూటరు క్లాసు, స్కూటరు క్లాసు నుండి కార్ల క్లాసుకే తాము ఎదగలేరా? తోటివారిలో తమ అంతస్థు పెంచుకోలేమా? జీవితంలో కొంచెం సుఖాన్నయినా చవిచూడలేమా?

"ఏమిటి కరుణా- ఆలోచిస్తున్నావ్ !" అన్నాడు మన్మధ ఆ రాత్రి కరుణ అన్యమనస్కంగా వుండడం చూసి.

"ఏమండీ !" దూరంగా పడుకున్న కరుణ అతనికి దగ్గరగా జరిగింది.

"ఏమిటి ?"

"మనం కూడా వో స్కూటరు కొనుక్కుందామ డీ !" మన్మధ విగ్గరగా నవ్వేడు. "ఇంపాజిబుల్ ! ఇసుకలో తైలాన్ని తీయడమన్నా సులభమేమో కానీ ఇమీడియట్‌గా స్కూటరు కొనడం మాత్రం కాదు "

"ఏం ఎందుకు కాదూ ? కరుణ లేచి కూర్చుని రెట్టించింది.

"ఓసి పిచ్చిదానా ఇవాళ నువ్వు స్కూటర్‌ను బుక్‌చేసుకుంటే అది నీ కొడుకు పెళ్ళినాటికైనా నీకు రాకపోవచ్చు !"

"ఏం తమాషాగా మాట్లాడతారండీ ? అందరూ కొనుక్కోవడం లేదా ? వాడుకోవంలేదా?"

"వాళ్ళంతా నల్ల బజారులో కొనుక్కుంటూండవచ్చు."

"మనం అక్కడే కొనుక్కుందాం."

"తెల్లబజారులో కొనే తాహతే మనకు లేదు. ఇక నల్లబజారుదాకా మనమేం వెళ్ళగలమూ ?"

"తాహతెందుకు లేదూ ?- మహా అందరికీ వున్నట్టు ! తాహతు వున్న వాళ్ళే కొనుక్కుంటున్నారేమిటీ ? ఏదో సరదా ! ! మీకే సరదాలు లేవు. మీదో యాంత్రిక జీవితం."

కరుణ గొంతు గద్దదికమైంది.

నెలకు అయిదారొందలు సంపాదిస్తున్నారు. బయట లెక్చరర్ అంటే ఎంత హోదా ? ఎంత గౌవరవం? ఒక్క స్కూటరు కొనుక్కోలేమా మనం ? మా ఊళ్ళో నేతకొట్టు వీరస్వామి కొన్నాడు. హైదరాబాదులో ఎంచక్కా ఆడవాళ్ళు మగవాళ్ళు స్కూటర్లమీద తిరుగుతారో ! మన వూళ్ళో కూడా ఇపుడిప్పుడే ఇట్లా తిరుగుతున్నారు. మీరు ముందు కూర్చుని ఠీవిగా స్కూటర్ డ్రైవ్‌చేస్తుంటే నేను వెనగ్గా కూర్చుని మీ నడుంచుట్టూ చేయివేసి .. .. " చెప్పడం ఆపేసింది కరుణ.

"అందమైన ఆ కలను ఆసాంతం చెప్పు కరుణా ! మధ్యలో ఆపకు," మన్మధ ఆమెను దగ్గరకు పొదువుకొని ప్రేమగా అడిగాడు.

క్షుద్రసాహిత్యం

ఇంత క్షుద్ర సాహిత్య రచయిత అయితే మాత్రం
సన్మానం అని మాకు ఇలాంటి దండ వేస్తారా!!




"ఆ కలను నిజం చెయ్యరూ?" అతని చెవిలో మురిపెంగా పలికింది కరుణ.

మన్మధ బరువుగా నిట్టూర్చాడు.

"నిజం చెయ్యాలనే నాకుంది కరుణా! కనీసం ఓ సెకండ్‌హాండ్‌ది అయినా సరే కొందామని వుంది. కానీ ఎట్లా? నెలనెలకు నాన్నకు పంపే డబ్బు ఆపేయనా? మా చెల్లెలి పెళ్ళికోసం ఆదాచెయ్యడం మానుకోనా? ఇంట్లో ఆలికి అన్నంపెట్టడం మానేయనా? ఇంటాయనకు అద్దె చెల్లించటం మానుకోనా? వీటిల్లో ఏదో ఒకటి చేస్తే కానీ డబ్బువుండదు నా దగ్గర. ఏం చెయ్యమంటావ్?"

కరుణ ఒక్క క్షణం మౌనంగా వూరుకుంది. ఆ తరువాత మెల్లగా అన్నది. "నేనో పని చెప్తాను చేస్తారా?"

"ఏమిటది?"

"నా నగలిస్తాను. అమ్మేస్తారో తాకట్టుపెడతారో మీ ఇష్టం. ఏం చేసినా నాలుగైదు వేలకి తక్కువ రాదు. అదిపెట్టి స్కూటరు కొనండి!"

ఆ మాట విని మన్మధ అవాక్కయిపోయాడు. కొంతసేపటికి తెప్పరిల్లు కుని "ఈ ఊహ నీ కెందుకొచ్చింది కరుణా ?" అన్నాడు బలహీనంగా.
కరుణ అతని జుట్టులోకి వేళ్ళుపోనిచ్చి దువ్వుతూ ప్రేమగా అన్నది.

"ఏమండీ! చెమటలు కక్కుకుంటూ అంతదూరం నుండీ మీరు సైకిలు మీద అట్లా వస్తుంటే నే చూడలేనండీ! మీరు నా కలల యువరాజు. మీరు ఎంత ఠీవిగా దర్జాగా వుంటే అంత ఆనందం నాకు. సంఘంలో మీ స్టేటస్ ఎంత పెరిగితే నాకు అంత సంతోషం. ఒకరికన్నా మీరు ఎందుకు తక్కువ కావాలి! ఎందులో తక్కువ కావాలి? మీరు చేస్తున్న త్యాగం విలువ ఎంతటిదో ఎవరికి తెలుసు?. నాకు తప్ప! రేపు మీ చెల్లెలు పెళ్ళిచేసుకుని ఒక ఇంటికి వెళ్ళిపోతుంది. అప్పుడామెకు మీరుపడ్డ శ్రమ గుర్తుండదు. అప్పుడు మీరు సుఖపడుదామన్నా నేను మిమ్మల్ని సుఖపెడదామన్నా కాలం మనకు అనుకూలం కాదు కదా! అట్లా అని మీ మంచితనాన్ని మీరు పోగొట్టుకోవద్దు. మీ త్యాగంచేయడం మీరు మానుకోవద్దు. మీరు ఇతరుల కోసమే కష్టపడండి మీకోసం మాత్రం కొంచెం నన్ను కష్టపడనీయండి. అది చాలు నాకు! ఆ కొంచెం కష్టంలోనే, ఆ కొంచెం త్యాగంలోనే నాకు మనశ్శాంతి!!"

ఆమె మాటలు విన్న మన్మధకు ఏమని జవాబు చెప్పాలో తెలియలేదు. "కరుణా!" అంటూ ఆమెను గాఢంగా గుండెలకు హత్తుకున్నాడు. అతని కను కొలకుల చిందిన బాష్పబిందువొకటి ఆమె వక్షస్సుపై జారిపడింది.

* * *

స్కూటరు మీద దిగిన కూతుర్నీ అల్లుణ్ణీ చూసి జగన్నాధం దంపతులు పొంగిపోతూ సాదరంగా లోపలకు ఆహ్వానించారు.

"ఏం బావగారూ ఇది బజాజా, లాంబ్రెట్టానా, రాజదూతా, మోపెడా?" అంటూ ప్రశ్నలతో వయస్సులో చిన్నవాళ్లయిన బావమరుదలు మన్మధను వేపుకుతిన్నారు.

"దీని హార్స్‌పవరెంతండీ? పెట్రోలు లీటరు ఎన్ని మైళ్ళు వస్తుంది?" అంటూ కొంచెం పెద్దవాళ్ళు ఆసక్తితో ప్రశ్నించారు.

"బావగారూ! వెనకాల కూర్చోపెట్టుకుని మమ్మల్ని ఊళ్ళోకి తీసుకు వెళ్ళరూ" అంటూ మరదళ్ళు కుతూహలంగా అర్ధించారు.

"ఉండడర్రా, అతన్ని కాస్త విశ్రాంతి తీసుకోనీయండి." అంటూ జగన్నాధం పిల్లలను కసిరేవరకూ మన్మధకు ఆ తాకిడి అల్లాగే వుండిపోయింది.

తన భర్త చుట్టూచేరి పదిమంది కాంక్షానేత్రాలతో అత్రుతగాన్న హృదయాలతో ఆరాధనా కంఠాలతో అట్లా అడుగుతుండడం చూసి కరుణ గర్వంగా మన్మధవేపు చూసి లోపలకు వెళ్ళింది.

ఆ అనుభవం మన్మధకు క్రొత్తగా వుంది. ఒక్కసారి తానెంతో ఎత్తుకు ఎగిరినట్లుంది.

ఆ సాయంకాలం అతను పిల్లలను స్కూటరుమీద ఎక్కించి పెట్టుకుని బజారులో తిప్పి తీసుకువచ్చాడు. భార్యతో కలిసి సినిమాకు బయలుదేరుతూ "ముందస్తుగా మేం వెళ్తున్నాం. వెవగ్గా మీరు రండి." అన్నాడు.

మన్మధతో కలిసి స్కూటరు వెనకసీటుమీద హార్చుని గాలిలో తేలిపోతూ, భర్తభుజాలు అనరాగా ముందుకు ప్రయాణం చేస్తున్న కరుణకు అంతకన్నా తన జీవితానికి మరే సార్ధకతా అక్కరలేదనిపించింది. తను చేసిన పని ఎంతో ఉదాత్తమైనదనిపించింది.

కానీ అంతటి ఉదాత్తభావమూ ఆ రాత్రి తల్లితండ్రులు అడిగిన ప్రశ్నలకు నీరుకారిపోయింది.

"ఏమే కరుణా! ప్రొద్దుటనుంచి చూస్తున్నాను. అదేమిటే– నీ మెడ అట్లా బోసిగా ఉందీ!" అని అడిగింది ఆమె తల్లి అరుంధతమ్మ. కరుణ ఏదో చెప్పాలని నోరు తెరిచింది. ఏం చెప్పాలి? అబద్ధమా? నిజమా?

"అమ్మాయ్ చేతుల్ని గాజులు కూడా కనబడడంలేదే?" అన్నాడు జగన్నాధం తానేదో క్రొత్త విషయాన్ని కనుక్కున్నట్టుగా.

అరుంధతమ్మ కరుణ చేతులవేపు చూసింది. కరుణ చెవులవేపు చూసింది. కరుణ మెడవేపు చూసింది. కరుణవేపు ఆశ్చర్యంగా, అనుమానంగా, నిందా దృక్కులతో చూసింది.

"ఈ దిగడుడుపు రూపమేమిటే? పెళ్ళినాడు మేము, మీ అత్తగారూ పెట్టిన నగలన్నీ ఏంచేశావే?"

కరుణ తల్లివైపు నిశ్చలంగా చూసింది. నింపాదిగా అన్నది." స్కూటరు కొన్నాం!"

ఆ మాట వినగానే అల్లుడిమీద ఆమె అంతవరకు పెంచుకున్న గౌరవం ఒక్కసారిగా క్రిందకు దిగజారిపోయింది.

"ఇదేమిటే? విశేషపంలాంటి పీ నగలు తీసుకువెళ్ళి వో ఇనుపముక్క-

మోహాన పెట్టాడా? అల్లుడు ఇంత తెలివితక్కువ వాడనుకోలేదే!" అన్నది ఈసడింపుగా.

"ఏమైనా తాను సంపాయించిన దాంతో ఇటువంటి పనులు చేయాలి కానీ ఆడదాని సొమ్మంతా తాను షోకుచేసుకోవడం ఏం బాగాలేదు." పైమీది కండువా దులిపి బుజాన వేసుకుని అక్కడనుంచి లేచిపోతూ అప్పుడే లోపలకు వచ్చిన మన్మధ "ఏమిటండీ బాగాలేదంటున్నారు!" అంటూ వాళ్ళదగ్గరకు వచ్చాడు.

"నాన్నా! మన స్కూటరు ఎంత బాగాపోతోందో తెలుసా? దార్లో ఎవ్వింటినీ ఓడించేసింగో!" అంటూ లోపలకు అత్యుత్సాహంగా వచ్చిన కరుణ చిన్న చెల్లెలు అక్కమొహంలోని బాధనూ, అసహ్యాన్ని గమనించి అక్కడే నిల్చుండిపోయింది.

"అమ్మా! మీ అల్లుడి గారికి స్నానానికి నీళ్ళు తోడుదాం పద!" అన్నది కరుణ అక్కడినుండి లేస్తూ!

"అట్లాగే పద తల్లీ! పోయిన నగలెట్లాగు రావు కదా, వాటిని గురించి ఇంకా చర్చకూడా ఎందుకులే!" అంటూ అరుంధతమ్మ కూతురితో కలిసి లోపలకు వెళ్ళిపోయింది.

మన్మధ తన మావగారిని ఏదో అడగబోయాడు. ఆయన పనుందంటూ ప్రక్కకు తప్పుకున్నాడు. ఆ ఇంట్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి నట్లనిపించింది అతనికి. చూచాయగా అది తన భార్య నగల గురించి అని కూడా అర్థమైంది. దాంతో అతని మనసు చివుక్కుమంది. అవి తమ నగలు! తామేం చేసుకున్నా ఇతరులు వారెవ్వరైనా కానీ తమను ప్రశ్నించడానికి వీలులేని నగలు!!

భోజనం చేశాననిపించి, మంచం మీదకు చేరాడు. కొంచెం పేపటికి మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ అక్కడకు వచ్చిన కరుణ మరెవరికి వినిపించనంతటి మెల్లగా అతనికి "క్షమించండి. నామూలంగా మీకు అవమానం జరిగింది" అన్నది డగ్గుత్తి కంఠంతో మన్మధ చివాలున తలెత్తాడు కరుణ కళ్ళల్లో నీళ్ళు. "రేపొద్దున్న ఇక్కడున్నందే మనం వెళ్ళిపోదామండీ!" అన్నది బాధగా.

"అట్లాగే వెళ్ళిపోదాం. దాన్ని గురించి నువు బాధపడకు." అన్నాడు మన్మధ తన మనసులో బాధను దాచుకుంటూ.

మర్నాడు స్కూటరుమీద ప్రయాణమైన కరుణను మన్మధనూ చూసి

"అప్పుడే వెళ్ళిపోతున్నారేం!" అన్నారు జగన్నాధం దంపతులు పొడిగా
"వేళ్ళాలండీ! సెలవులేదు!"

సెలవు లేదంటూ ముందుకు వెళ్ళిపోయిన ఆ ఇద్దర్నీ చూసి జగన్నాధం దంపతులు ఎంత విక్షిప్తంగా ఊరుకున్నారో, సెలవు లేకుండా, అనుకోకుండా ఇంటికి వచ్చిన కొడుకునూ కోడల్నీ చూసి పరంధామయ్య దంపతులు అంత ఆశ్చర్యపడ్డారు.

వస్తూనే, "నాన్నా! స్కూటరు కొన్నాను బావుందా?" అన్నాడు మన్మధ తండ్రివంక చూస్తూ.

"ఎందుకు బావుండదూ? ఎంతిపోసి కొన్నావేమిటి?" అన్నాడు పరంధామయ్య ప్రశ్నార్థకంగా.

"బ్లాక్‌లో కొనాల్సివచ్చింది నాన్నా! అయిదువేలకు పైనే అయింది".

"అయిదువేలే"! ఈ సారి ఆశ్చర్యపోవడం పార్వతమ్మ వంతయింది.

"ఆ అయిదు వేలతోనూ లక్ష్మికి కట్నం సొమ్ము తీరిపోయేది!"

మన్మధ మనసు ఆ మాటతో చిన్నబోయింది. తను స్కూటరు కొన్నందుకు తన తల్లి తండ్రీ ఏమాత్రం సంతోషించడం లేదా?

రాత్రి భోజనాల దగ్గర మళ్ళీ ఆ ప్రస్తావన రానేవచ్చింది.

"ఏరా స్కూటరూ అదీ కొనుకున్నావ్ బాగానే వుంది. అనుభవించాల్సిందే కాదనను. కాని నీ చెల్లెలికి ఆ మూడుముళ్ళు కూడా తొందరగా వేయించేస్తే..."

"అలాగే చూద్దాం నాన్నా!"

"చూద్దాం అంటే కాదురా. నీ దగ్గర డబ్బు నిల్వ ఉండేట్టు నాకు తోచదు. అల్లాలకు బెల్లాలకు వాడేట్టున్నావ్! నిన్ను చూస్తే నాకు ఇదివరకున్న ధైర్యం ఇప్పుడు తగ్గిపోతోందిరా!"

మన్మధ హృదయం భగ్గుమంది. చివాలున తండ్రి వైపు తలెత్తి చూశాడు తల్లి వైపు చూశాడు. ఆమె పెళ్ళికావలసిన కూతురివైపు చూస్తోంది. మన్మధ తలుపు దగ్గర నిలబడ్డ తన చెల్లెలివైపు చూశాడు. ఇట్లా ఎందుకు చేశావు అన్నయ్యా?' అంటున్నాయి ఆ కళ్ళు.

భోజనాలైన తర్వాత అంతా బయట తండ్రీకొడుకులు పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటున్నారు. మన్మధ ఎంత నిండుకుండలా వుందామన్న ప్రయత్నం చేసినా గుండెలో తెలియని కసిఏదో భగ్గుమంటోంది. మధ్యలో మంచినీళ్ళకోసమని

మన్మథ లోపలకు వచ్చినప్పుడు అతనికి వినిపించిన అతని తల్లిమాటలు అతణ్ణి విశ్చేష్టుణ్ణి చేశాయి.

"అదికాదు కరుణా! నీ నగలన్నీ అమ్మి తను స్కూటరు కొనుక్కునే ఖర్మెంపట్టిందే నా కొడుక్కి? లక్షణంగా అయిదొందలు తెచ్చుకుంటున్నాడు. అడిగిన వాళ్ళకు అడిగినంత ఇవ్వగలడు నా బిడ్డ! నా దెక్కడ మా అందరికీ తప్పితలకెత్తుతాడో అని సందస్తుగా ఇది నువ్వు ఆడుతున్న నాటకం కాదు కదా! రేపొకవేళ నీ ఆడబిడ్డ పెళ్ళికోసమని మేమేదన్నా సాయం అడిగితే 'అయ్యో! నా నగలే అమ్మి ఆయన స్కూటరు కొనుక్కున్నారండీ- ఆయన దగ్గర డబ్బెక్కడుందండీ, అనటానికి కాదుకదా ఈ నాటకం!",

"అత్తగారూ!"

"అత్తగారూ బెండలూనూ! ఎప్పుడూ ఇటువంటి కబుర్లు చెప్పి మా పరువూ మా బిడ్డ పరువూ బజారుకెక్కించకు తల్లీ!"

కన్నీళ్ళతో బయటకు వస్తోంది కరుణ.

ఆమె మొహం చూడడానికి సిగ్గువేసింది మన్మధకు. తటాలున తలుపు ప్రక్కకు తప్పుకున్నాడు.

మరునాటి ఉదయం కరుణ నిద్రలేచేసరికి మన్మధ పట్నానికి వెళ్ళిపోయాడు. 'తన్ను తీసుకువెళ్ళకుండా, నాతో చెప్పకుండా ఎందుకువెళ్ళాడు!' అని అడిగింది కరుణ, తనకు కనిపించిన ఇంట్లోవాళ్ళందర్నీ కానీ ఎవరు మాత్రం ఆమెకు ఏం సమాధానం చెప్పగలరూ? ఎవరికి తెలుసూ?- మన్మధ పట్నంలో తన స్కూటరు అమ్మెయ్యడానికి ప్రయత్నం చేస్తున్నాడని? .....

